# రోడ్డు పక్కని శవం

**ఆ** శవం ఎవరిదో, అక్కడికెట్లా వచ్చిందో? ఆ మనిషి ఏ కారణం చేత చచ్చిపోయినాడో ఎవరికీ తెలియదు. రాత్రివేళ ఆ మనిషి ఎవరో అక్కడికి వచ్చి పడుకుని చనిపోయి ఉండాలి ఆ రోడ్డు పక్క. లేదా ఎవరైనా - ఎబ్బే, వాణ్ణెవరు చంపుతారు?

ఝాము పొద్దెక్కేదాకా అది శవమని ఎవరూ గమనించలేదు. అందుచేత ఎవరూ ఆగి తొంగి చూడలేదు. శవమని తెలిశాకనే కొందరు ఆగి తొంగి చూశారు. కాస్సేపు నిలబడి వెళ్ళిపోయారు. బతికుండగా కన్న చచ్చి ఎక్కువ మందిని ఆకర్షించేటట్టు బ్రహ్మదేవుడి వరం ఉంది మనిషికి. శవాన్ని చూడగానే ఎవరి అభిమాన తత్వాలను వారు స్మరించటం రివాజు.

పుట్టినవాడు గిట్టక తప్పదు.

ఎవరి కెక్కడ చావు రాసిపెట్టి ఉందో.

ఈ సంఘంలో దరిద్రుల గతి ఇంతే.

దేవదాసు చచ్చిన సందర్భంలో శరత్ ఏమిటన్నాడూ!

ఆ శవాన్ని గురించి అందరూ ప్రశ్నలడిగేవారే గాని చెప్పేవాళ్ళు లేరు. కాని బొత్తిగా ఎవరికీ దాన్ని గురించి ఏమీ తెలియదనుకోవటం పొరపాటు. ఎందుకంటే, అజ్ఞానం మనుష్యుల నాకర్షిస్తుంది. ఏం జరుగుతున్నదీ తెలియని చోట ఎక్కువమంది చేరుతారు. ఈ శవం దగ్గర పదిమంది కూడా గట్టిగా గుమిగూడలేదు.

ఇది సంపన్నుడి శవం కాదు, మధ్యతరగతి శవం కూడా కాదు. ఆఖరుకు తన పొట్ట పోసుకుంటూ ఉండిన కూలివాడి శవమైనా కాదు. మనిషి బతికుండగా ఉండిన హోదా కొంత శవానికి సంక్రమిస్తుంది. నేనొకసారి శ్మశానం దగ్గర ఒక శవాన్ని చూశాను. అది మెత్తని పరుపుల మీద తీసుకుని, ఖరీదైన ఇంజెక్షన్లతో ప్రాణం విడిచిన మనిషి శవమని, చూడగానే గ్రహించాను.

చచ్చేటప్పుడు మనిషి బతికుండగా లేని హోదా రావాలంటే, ఆ మనిషి దుర్మరణం పాలు కావాలి, ఎవరైనా పొడిచి చంపాలి, నీళ్ళలో మునిగి చావాలి, రైలు కిందనో, కారు

కిందనో పడి చావాలి. పోలీసుల నాకర్షించని శవం – అంటే, ఇతర ఆకర్షణలు లేనప్పుడు – ప్రజల నాకర్షించదు.

అనాదరణకీ, చలికీ, ఆకలికీ గురియై చచ్చినవాడు లోకాన్ని ఆకర్షించిన నాడు లోకంలో మనుషులు అనాదరణకి, చలికి, ఆకలికి, చావటం మానేస్తారు. మనిషి ఫాలాక్షుడు. ఫాలం విప్పి మనిషి ఏ సమస్యకేసి చూసినా, ఆ సమస్య యొక్క స్వరూపం మారిపోతుంది. అయితే తాను ఫాలాక్షుడన్న విషయం మనిషికి తెలీదు. అందుచేత ఫాలం విప్పడు, శివోహం అనుకోడు.

ఒక మగవాడూ ఆడదీ చేరి శవం కోసం యాచన ఆరంభించారు. అక్కడ చేరి చూస్తున్న నలుగురయిదుగురూ కూడా తొందరపనులు జ్ఞాపకం వచ్చి నిష్క్రమించారు. చచ్చిపోయిన ఆ దరిద్రుడి దారిద్ర్యాన్ని పంచుకోవటానికి ఎవరికి ఉత్సాహం ఉంటుంది? సంఘంలో ఆ శవానికున్న ప్రాముఖ్యాన్ని గుర్తించిన ధనికులు తమతమ ఉత్సాహం కొద్దీ అణాలూ, బేడ కాసులూ ఇచ్చారు.

అవును, ఆ శవానికి సంఘంలో అతి విలువైన స్థానం ఉంది. దేశ సంపదలో మిగిలిన వాళ్ళకి మరికొంచెం పెద్దవాటా వచ్చేందుకు ఈ శవం దారిద్ర్యంలో ఓలలాడింది; వీడు అన్నానికి లేక కొంతకాలం మాడటం వల్ల ధనికుల కుక్కలకి ఒక మెతుకు అన్నం ఎక్కువ దొరికింది; వీడు చెట్లకింద నివసించటం వల్ల ఒక ఆసామికి వుండ ఇల్లు దొరికింది; వీడు చావటం వల్ల భూభారం కొంత తగ్గింది. ప్రపంచంలో వీడొక్కడా? వీడిలాటివాళ్ళు లక్షలున్నారు. ఆ సంపదలో వాటాలనీ, ఆ అన్నం మెతుకులనీ, ఆ ఇళ్ళనూ లక్షలు పెట్టి గుణించండి, కోట్లు పెట్టి గుణించండి, భూభారం తెలుస్తుంది.

## 2

వీడు సంపన్నుడు కాడు, మధ్యతరగతి కాడు, కూలివాడైనా కాడు. అని మనకి తెలుసు. వీడు బిచ్చగాడైనా కాడు, కాని బిచ్చం ఎత్తటం ఎత్తాడు. చేసేటందుకు పని లేకపోతే ఆకలి దహించుకుపోతుంటే, రోజులు తరబడి నీ పెళ్ళాం పిల్లల కింత గంజినీళ్ళయినా గతిలేకపోతే బిచ్చం ఎత్తక ఏంచేస్తావు?

బిచ్చం ఎత్తటం మాత్రం అందరికీ చాతవుతుందా? బిచ్చగాళ్ళలో మహా రాజులున్నారు. మహామంత్రులున్నారు. అది వాళ్ళ సొమ్ము, వాళ్ళ విద్య, వాళ్ళ కళ. అవన్నీ నీకు చాతకానప్పుడు దారిపొయ్యేవాణ్ణి నిలవదీసి అటకాయించలేవు. పలకరిస్తావు. అవతలివాడు వినిపించుకోకుండా దాటిపోగానే పెద్ద గండం గడిచినట్లు సంతోషిస్తావు. కాని, ఆ సంతోషం ఎంతసేపు దక్కుతుంది? ఇవతల నీ ఆరాటం నిన్ను ఊరుకోనిస్తుందా?

మళ్ళీ ఇంకోణ్ణి పలకరిస్తావు! లాభం లేదు. అయిదారుగురు దాటిపోయినాక నీ ఆత్రం రెచ్చిపోయి ఈసారి పక్కగా వచ్చినవాడికేసి అరుస్తావు. నీ గొంతులో కంగారు చూస్తే నీకే అసహ్యం వేస్తుంది. అవతల మనిషికి అదెట్లా వుంటుందో నీకు తెలుసు. నీ కేకకు ఆ మనిషి నీకేసి చూస్తాడు – దొంగతనం చేస్తున్నవాణ్ణి పట్టుకున్నట్టుగా. నీ క్కూడా దొంగతనం చేసి దొరికిపోయినట్టే వుంటుంది. ఏదో గొణుగుతావు. ఆ మనిషి నీకేసి కోపంగా చూసి వెళ్ళిపోతాడు – దమ్మిడీ ఇవ్వకుండా.... ఎక్కడన్నా ఒకడు నీకేసి ఆత్రంగా చూసి నీ కళ్ళల్లో ఏదో వెతుకుతాడు. నీ అవసరం వాడికి చాలవరకు అర్థమవుతుంది; కాని నూరు వంతులు వాడి దగ్గిర డబ్బుండదు, నీ కివ్వటానికి... నీకా క్షణంలో బిచ్చగాళ్ళను చూస్తే అసూయేస్తుంది. బిచ్చం మీద అపరిమితమైన అసహ్యం కూడా వేస్తుంది. నీకు చదువు రానక్కర్లేదు. నువు ఘరానా మనిషివి కానక్కర్లేదు – బిచ్చమెత్తటం, ఒక విద్యగా అభ్యసించటానికి, ఎంత హేయమైనదో నీకు స్పష్టంగా తెలుస్తుంది. కాని, ఏం చేస్తావు? చేసేటందుకు నీకేం చేతనవును? ఏదైనా చెయ్యటానికి నువ్వెవడవు? ఈ జగన్నాథ రథాన్ని నీవంటి అర్భకుడు కదిలించేనా? వొట్టిది. నీ వంటి అర్భకులొక వెయ్యిమంది కలిస్తే రథాన్ని ఎటుపడితే అటు ఈడ్చి పారెయ్యగలరు! కాని నీ దృష్టి నీవాళ్ళమీద లేదే, తెల్ల గుడ్డలవాళ్ళమీదా, ఇల్లుగల వాళ్ళమీదా, తిండి తింటున్నవాళ్ళమీదా, ఆస్తిపాస్తులు గల వాళ్ళమీదా ఉంటుంది. అంతే నీ ఖర్మ! ఆ రథచక్రం క్రింద పడి నలిగిపో. నువు కదిలించలేకపోతే ఇంకా కదిలించే వాళ్ళున్నారు. వాళ్ళు రథాన్ని వాళ్ళ పక్కకు లాక్కుంటున్నారు. నువు వాళ్ళదారిలో వున్నావు, తొలగలేవు.

పోనీ దొంగతనాలు చేస్తావా? ఎవరి జేబులన్నా కత్తిరిస్తావా? ఎవరింటి కన్నా కన్నాలు వేస్తావా? పోలీసులున్నారు జాగర్త!

ఆత్రం కొద్దీ దొంగతనం చేశావేమో? జైలు కెళ్ళావేమో? జైల్లో బాగాలేదు కదూ? ఆ మిగిలిన దొంగలు నీవాళ్ళు కారు. వాళ్ళు పెద్దమనుషులు. వాళ్ళు నీ మాదిరిగా కూలి చేశారా? లేదు! వాళ్ళకున్న ప్రపంచ జ్ఞానంలో నీకెన్నో వంతుంది? దొంగతనమూ ఒక విద్యే! వాళ్ళు చెప్పే కథలన్నీ విన్నావుకాదూ? వాళ్ళ కోతలన్నీ నమ్మావేమో కూడానూ? అయినా నీకు వాళ్ళమీద భక్తి కుదరలేదు. వాళ్ళవెంట జైల్లో వుండటం నీకు నీచంగా తోచింది.

నీది వెధవ జన్మ. నీచమైన పనులు చేయవు, ఘనమైన పనులు చెయ్యలేవు. నువు బతికేటందుకు మూడోదారిలేదు. అందుకని కాళ్ళు డొక్కలో పెట్టుకుని రోడ్డుపక్కన పడుకుని చచ్చిపో!...

## 3

ఈ మనిషి అకస్మాత్తుగా చావలేదు. స్పృహతప్పిన చాలా గంటలకి చచ్చాడు. ఈ లోపుగా వీడు కలలు కన్నాడు. అవి ఫ్రాయిడియన్ కలలు కావు. ఉటోపియన్ కలలు కావు. అవి పీడకలలు కూడా కావు. జన్మలో ఎన్నడూ వీడు ఎరిగి వుండని ఆనందం ఈ కలల మూలంగా వీడు పొందాడు. అవి వాడికి కలలల్లే లేవు, పచ్చి యథార్థం కన్న నిజంగా వున్నాయి.

మామూలు మనుషులు – అంటే రోజుకు రెండు పూటలా తిండి తిని, సంఘంలో ఒక మనిషల్లే తినేవాడెవడూ – కనే కలలు కావవి. అసలటువంటి కలలు కనాలని మామూలు మనుషులనుకోరు. అనుకోవటానికీ కలలకీ ఆపాటి సంబంధం వుండదా?

వీడి కల పూరి పాకతో ఆరంభమైంది. చక్కని ఒంటి నిట్టాడి పాకా, చుట్టూ పేడలికిన తడికలు. పాకమీద ఒక సొరపాదు పాకింది. దానికి లెక్కపెట్టలేనన్ని కాయలు కాసినై. ఆకుపచ్చని పెద్ద పెద్ద ఆకులు కప్పంతా కప్పేసినై. సూర్యకాంతి ఆ ఆకుపచ్చని ఆకులగుండా నేరుగా, మధ్య తాటాకులు అడ్డం లేనట్టు, పాకలోకి పడుతున్నది. పాకలో ఒక ఆడకూతురు వంట చేస్తున్నది. ఉడుకుతున్న అన్నం వాసనా, వెల్లుల్లి కాగుతున్న పులుసు వాసనా ముక్కుల్లోకి వస్తున్నది. ఆ ఆడకూతురు తన పెళ్ళాం అయి వుండాలి. ఎర్ర చీర కట్టుకున్నది, అటూ ఇటూ తిరుగుతుంటే మట్టెలు మట్టినేలకి తగిలిన అస్పష్టమైన చప్పుడు వినిపిస్తున్నది. రెండు పొయిల కింద చితుకుల మంటలు పచ్చ పచ్చగా ఎర్ర ఎర్రగా కళ్ళకి ఎంతో ఆనందం కలిగిస్తున్నై.

ఈ లోకంలో ఒక మనిషి ప్రాణానికి అంత ఆనందం ఇచ్చేందుకు ఏముంది? వీడికి కల ఎందుకింత ఆనందం ఇచ్చింది! ఆ కలని వొదిలేసి రెండో కలకి వాడి మనస్సు ఎంత సేపటికీ పోలేకపోయింది!

తను చేనుగట్టున నిలబడ్డాడు. ఆ చేను ఎవరిదో తనకి తెలీదు. ఒకవేళ తనదేనేమో. ఆ గుడిసె మాదిరిగానే ఈ చేను కూడా ఎవరిదనే ప్రసక్తి లేకుండానే తనకి అంత ఆనందం ఇచ్చింది. చేను బాగా ఏపుగా పెరిగింది. కంకి వేసింది. పొట్టలు కూడా పోసుకున్నై కాని ఇంకా కోతకి రాలేదు ! పక్కన కాలవలో ఎద్దు నీళ్ళు తాగుతున్నై. వాటి మెళ్ళో మువ్వల చప్పుడు వినిపిస్తున్నది. చేను మీదినుంచి గాలి తన మీదికి కొడుతున్నది. పైరు వాసన ముక్కుకి తగులుతున్నది. ఎంత ఆనందంగా వుంది!

ఇందులో వీడికి ఆనందం కలిగించేటందు కేముందో చెప్పటం కష్టం. కాని వాడి

ఆనందానికి మేరలేదు. ఆ కలని విడిచి వాడి మనస్సు మరో కలకి ఎంత సేపటికీ పోలేకపోయింది.

అదొక పెద్ద యిల్లు. దానికెక్కడా గోడలూ, వాకిళ్ళూ ఉన్నట్లులేదు. రాత్రివేళ కాబోలు; ఎక్కడ చూసినా దీపాలే. అంతటా మనుషులే. మగవాళ్ళూ, ఆడవాళ్ళూ, పిల్లలు గుంపులు గుంపులుగా వున్నారు. ఒక్కోరు ఒక్కో కుటుంబం. ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. ఎవరూ ఏమీ మాట్లాడుతున్నట్టు లేదు. కాని ఒకరు చేసేపని మరొకరికి తెలుసును. ఒకరి పనికీ ఒకరి పనికీ సంబంధం వుంది. అంతా వేరు వేరు పనులమీద వున్నా అందరూ కలిసి చేస్తున్న పని ఒకటే అని తనకి తెలుసు. అది అవసరమైన పనేగాని గొప్ప పనికాదు. ఇదంతా తనకి ఎట్లాగో తెలుసును. తనకూ వాళ్ళకూ మధ్య వున్నది చుట్టరికం కాదు, స్నేహం కాదు, అంతకన్న కూడా సహజమైనదీ విశాలమైనదీనూ. వాళ్ళందరూ చేస్తున్న అన్ని పనులూ కలిపి తన పనే. అక్కడ వున్న అన్ని వేల మందికీ మధ్య ఒక చిన్న అభిప్రాయ భేదం లేదు. వాళ్ళందరికీ తనలోనూ, తనకి వాళ్ళలోనూ నూరుపాళ్ళు విశ్వాసం వుంది. తను కూర్చున్నదీ, నుంచున్నదీ, పడుకున్నదీ కూడా తనకే తెలీదు. తను ఏం చేస్తున్నదీ అవసరం లేదు. వాళ్ళందర్నీ చూస్తుంటే తనకెంతో ఆనందంగా ఉంది. వాళ్ళని తను పలకరించనవసరం లేదు. "మీరు నా వాళ్ళు నేను మీ వాణ్ని" అని చెప్పనవసరం లేదు. వాళ్ళకా మాట తెలుసును. వాళ్ళనట్లా చూస్తూ ఉండటం కంటె ఆనందం లేదు. తనకు నిద్ర వచ్చేస్తున్నది. కళ్ళు మూసుకు నిద్రపోవాలి. కళ్ళు మూసుకున్నాడు. కాని వాళ్ళు తన చుట్టూ వున్నారని తెలుసు. వాళ్ళక్కడే వుంటారు. క్రమంగా అన్ని చప్పుళ్ళూ అంతరించినై. మూసుకున్న కళ్ళ ఎదుట కనిపిస్తూ ఉండిన వెచ్చని వెల్తురు కూడా క్రమంగా గాఢాంధకారంగా మారిపోయింది. అతని మనస్సు నిశ్చైతన్యంలోకి వెళ్ళిపోయింది.....

***మొదటి ముద్రణ: ఆంధ్రజ్యోతి మాసపత్రిక, డిసెంబర్ 1948***